క్లుప్తంగా

ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు


ఇఫ్తార్ కార్యక్రమంలో ముస్లింలు

కూకట్‌పల్లి: రంజాన్ మాసం ప్రారంభం కావడంతో భరత్‌నగర్‌లోని మసీద్‌-ఏ-ఫాతిమ మసీద్‌లో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహిస్తున్నారు. ఏటా ఇలాగే ఇఫ్తార్, సహర్ ఏర్పాట్లు చేయగా నిత్యం 1000 మంది ముస్లింలు పాల్గొంటున్నారు. మసీద్ ప్రెసిడెంట్ మహమ్మద్ ఖలీల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. షేక్ మొహమ్మద్ మక్బూల్ షరీఫ్, మహమ్మద్ షరీఫ్, అల్తమష్, నాగిరెడ్డి, మెంబర్లు, వలంటీర్లు, యువకులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ కేంద్రం ప్రారంభం


మజ్జిగ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూ మెట్రోస్టేషన్ సమీపంలోని సాయినగర్‌లో ఇగ్నైట్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కేపీహెచ్‌బీ డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాటసారులు, వాహనదారులు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఇగ్నైట్ విద్యా సంస్థల చైర్మన్ కోర్లకుంట రమేశ్‌ను అభినందించారు. కార్యక్రమంలో సాయి నగర్ వాసులు వైఎస్. ప్రసాద్, అచ్యుత రామయ్య, దుర్గా ప్రసాద్ రెడ్డి, ఉమామహేశ్వరరావు, తులసీ, విష్ణు, ప్రసాద్, బాలకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వాలి


విద్యార్థులకు హాల్ టికెట్లు ఇప్పించిన కుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఫీజుల పేరిట విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఉండడం తగదని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్ పేర్కొన్నారు. పలువురు విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వడం లేదన్న సమాచారం మేరకు స్థానిక బీజేవైఎం నాయకులతో కలిసి సోమవారం వివిధ కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలను కలిసి హాల్ టికెట్లు ఇప్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాల్ టికెట్లు ఇవ్వకుంటే కళాశాలల ఎదుట ఆందోళనలు చేపడతామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్లు సాయి, రామకృష్ణ, ఆల్విన్‌కాలనీ అధ్యక్షులు ఎత్తరి రమేశ్, సురేశ్, హరిప్రసాద్, హుస్సేన్, చందు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అల్వాల్ ట్రాఫిక్ సీఐ ఏ.నాగరాజు సూచించారు. కొంపల్లిలోని అదమ మల్లారెడ్డి గార్డెన్స్‌లో 100 మంది ఆటో డ్రైవర్లకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫాం ధరించాలని, ఆటోకు నాలుగు దిక్కులా నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని, వాహన పత్రాలు దగ్గర ఉంచుకోవాలని, ఆటో యజమాని, డ్రైవర్ వివరాలు బోర్డులో పొందుపర్చాలన్నారు. అలాగే మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ నడపవద్దని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై నవీన్‌రెడ్డి, సిబ్బంది నవీన్, శుభమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పార్కుల నిర్వహణ ఇలాగేనా..?

- అధికారులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం
- స్థానిక నాయకులతో కలిసి హెచ్ఏఎల్ పార్కు సందర్శన
- సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశం


పార్కులో అధికారులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్ బోయిన్‌పల్లి: 'ప్రజలకు ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు అధ్వానంగా తయారయ్యాయని..నిర్వహణ ఇలాగేనా..?' అంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 1న 'పార్కులో అన్నీ సమస్యలే' అనే కథనం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితం కాగా, స్పందించిన ఆయన స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని హెచ్ఏఎల్ పార్కును సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఏఎల్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు పార్కులో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు దగ్గరుండి చూపించారు. దీంతో అధికారులను పిలిచి మందలించారు. జీహెచ్‌ఎంసీ అయా విభాగాల మధ్య సమన్వయ లోపంతో పార్కు నిర్వహణను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రోజువారీగా శానిటేషన్ సిబ్బందితో ఎందుకు శుభ్రం చేయించడం లేదని ప్రశ్నించారు. పార్కుకు డ్రైనేజీ ఔట్‌లేట్ లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పార్కు ఎదుట టీ స్టాళ్లు, చిరు వ్యాపారాలను తొలగించాలని, రాత్రుల్లో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పెట్రోలింగ్ చేయించాలని అధికారులకు సూచించారు. బోరు బావిలో మోటర్ బిగించి నీటి ఇబ్బంది లేకుండా చూడాలని, అలాగే పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఈఈకి సూచించారు. సీసీ కెమెరాలను కాలనీ అసోసియేషన్ వారే ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

అంజయ్యనగర్‌లో సీసీ కెమెరాల ప్రారంభం..

అంజయ్యనగర్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో మాజీ కౌన్సిలర్ మక్కాల నర్సింగ్‌రావు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. దీంతో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్, ఆలయ నిర్వాహకులతో కలిసి సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆలయ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు కోతిమీర్ అశోక్, ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింగ్‌రావు, ఉపాధ్యక్షుడు మక్కాల సత్యనారాయణ వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కారించారు. అలాగే అంజయ్యనగర్ యూత్ సభ్యులు స్థానికంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందించారు. స్పందించిన ఆయన కావాల్సిన స్థలాన్ని పరిశీలించాలని జీహెచ్‌ఎంసీ ఈఈ గోవర్ధన్‌కు సూచించారు. కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, రాజుగౌడ్, మక్కాల సత్యనారాయణ, కనకదాస్, మల్లేశ్‌యాదవ్, దండుగుల రమేశ్, మధుకర్, బ్యాగరి నర్సింహ, రమేశ్, రాజు, గిరి ఈఈ గోవర్ధన్, ఏఈ ఆశా, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, ఎంటమాలజీ సూపర్‌వైజర్ స్వామి పాల్గొన్నారు.


ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

దశలవారీగా సమస్యల పరిష్కారం


శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

ఆల్విన్‌కాలనీ: దశలవారీగా సమస్యలు పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ మొగులమ్మ బస్తీకాలనీ వాసులు సోమవారం ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలోనే మొగులమ్మ బస్తీకాలనీలో పర్యటిస్తానన్నారు. కాలనీలో రోడ్లు, యూజీడీ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా డ్రైనేజీ, తాగునీటి సరఫరాను మెరుగుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో మొగులమ్మ బస్తీ నాయకులు జాన్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కార్మికుల ఇళ్ల నిర్మాణానికి సహకరించాలి

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్ కంపెనీ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన స్థలంలో కార్మికులు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహకరించాలని ఆల్విన్ హౌసింగ్ సొసైటీ జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, రాష్ట్ర ఐఎన్‌టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూకట్‌పల్లి మండల పరిధిలోని ఆల్విన్‌కాలనీలో 2005లో సర్వే చేపట్టగా స్థలం తక్కువ కావడంతో అప్పటి సీఎం దివంగత రాజశేఖర్ రెడ్డి హయాంలో సుమారు 3 ఎకరాలు కేటాయించారన్నారు. ఆ భూమిలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వ రిజిస్ట్రేషన్, మున్సిపల్ పర్మిషన్లు కూడా ఇచ్చారన్నారు. కానీ కొందరు ఫిర్యాదు చేయడంతో మండల, మున్సిపల్ అధికారులు కార్మికులను ఇంటి నిర్మాణం చేసుకోకుండా అడ్డుపడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వేం నరేందర్‌రెడ్డి త్వరలో అధికారులతో చర్చించి కార్మికులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న భాస్కర్ రెడ్డి, నాయకులు

అవార్డుల ప్రదానానికి రండి

ఆల్విన్‌కాలనీ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘం సేవా సంస్థ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖల సంయుక్తాధ్వర్యంలో ఈనెల 7న కూకట్‌పల్లి అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఉదయం 9 గంటలకు చాకలి ఐలమ్మ స్త్రీ శక్తి పురస్కారాలు అందించనున్నారు. ఈ మేరకు వేడుకలకు హాజరు కావాలని కోరుతూ అరుణ అశోక్ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సోమవారం కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక, సాహిత్యం, సంగీతం, నృత్యం, అభినయం, సినీ, టీవీ, పోలీస్, న్యాయశాస్త్రం, రైతు, రాజకీయం, చిత్రలేఖనం, క్రీడలు వంటి అంశాల్లో ప్రతిభ చూపిన మహిళలను సన్మానించి అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వారి వృత్తికి న్యాయం చేస్తున్న మహిళామణులను సత్కారం చేస్తామని పేర్కొన్నారు.


దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వానపత్రికను అందజేస్తున్న అరుణ

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు


శిక్షణ ఇస్తున్న మేడ్చల్ డీఈఓ విజయకుమారి


పాల్గొన్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: డీఎస్సీ–2024 ద్వారా నియామకమైన 36 మంది ఎస్జీటీ ఉపాధ్యాయులకు కూకట్‌పల్లి జడ్పీ పాఠశాలలో 3 రోజులుగా ఇస్తున్న శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా విద్యాధికారి ఐ. విజయకుమారి నూతన ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేశారు. పాఠ్య పుస్తకాల వినియోగం, తరగతి గది నిర్వహణ, విద్య అభ్యాసన ప్రమాణాల పెంపు, పాఠ్య ప్రణాళికలు, మూల్యాంకన పద్ధతులు, వివిధ రకాలైన రికార్డులు, ఐసీటీ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంఓ రవీందర్ రాజు, మల్కాజిగిరి ఎంఈఓ సురేశ్, ఎగ్జామినేషన్ ఏసీ పాపిరెడ్డి, కీసర, ఆల్వాల్, బాలానగర్, మేడ్చల్ ఎంఈఓలు శశిధర్, మురళీ కృష్ణమూర్తి, హరీశ్ చందర్, రంగాచారి, కూకట్‌పల్లి ప్రధానోపాధ్యాయుడు నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మోతీనగర్: మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాకేశ్ గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. వివేకానందనగర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు గాయత్రీనగర్, జ్యోతినగర్, చంద్రగార్డెన్ ప్రాంతాలు. 11 కేవీ పర్వత్‌నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 5 వరకు పర్వత్‌నగర్, ప్రభుత్వాసుపత్రి ప్రాంతం, ప్రభుత్వ పాఠశాల ప్రాంతం, జేపీనగర్‌లో, 11 కేవీ ఎస్‌బీఐ కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆర్‌ఆర్‌ఆర్ వైన్స్ రోడ్డు, ఎస్‌బీఐ కాలనీ, కైత్లాపూర్ బ్రిడ్జి, చందానాయక్ తండాలోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

క్రైం కార్నర్..

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్మరి ఆంజనేయులు (27) భార్య ఇద్దరు పిల్లలతో కలిసి కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఇందిరానగర్‌లో నివాసముంటున్నారు. ఫిబ్రవరి 27న మెదక్ జిల్లా దడాయపల్లిలోని జాతరకు వెళ్లాలని అనుకున్నారు. అయితే ఆంజనేయులు ఊరికి వెళ్లి ఇంటికి వచ్చాడు. తన భార్య చెప్పకుండా, తన వెంట రాకుండా పుట్టింటికీ వెళ్లిందనే మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఉదయం వెళ్లి తలుపు కొట్టగా తీయలేదు. దీంతో తలుపులు పగులగొట్టి లోనికి వెళ్లగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.



ఆంజనేయులు (ఫైల్) రామారావు

తాగిన మైకంలో మరొకరు..

తాగిన మైకంలో ఓ వ్యక్తి ఉరేసుకున్నాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి రామారావు (35), భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి మూసాపేటలోని జిల్లా బస్తీలో నివాసముంటూ.. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లి సాయంత్రం వచ్చిన భర్తను భార్య ఎక్కడికి వెళ్లావని నిలదీసింది. దీంతో 'నాకే చెబుతావా అంటూ' గొడవ పడి తాగిన మైకంలో భార్యపిల్లలను బయటకు నెట్టేసి తలుపు వేసుకున్నాడు. దీంతో పక్కనే ఉన్న ఆమె సోదరుడి ఇంటికి పిల్లలతో వెళ్లింది. రాత్రి 10 గంటల సమయంలో బంధువులు ఇంటికి రాగా రామారావు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే విషయాన్ని రామారావు భార్యకు తెలపడంతో ఆమె సోదరుడితో కలిసి ఇంటికి వెళ్లింది. స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

దుండిగల్: ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ సూచించారు. గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2020లో స్వీకరించిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఈనెల 31లోగా క్రమబద్ధీకరించుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇస్తుందన్నారు. ఇంకా ఎవరికైనా సందేహాలు ఉంటే హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.



మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

హెచ్‌సీయూ ఎస్పైర్ బయోనెస్ట్ స్టార్టప్‌కు కేంద్రం చేయూత

వీజెన్ ల్యాబ్స్ స్టార్టప్‌కు రూ.3.76 కోట్ల ఆర్థికసాయం


ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్ స్టార్టప్ నిర్వాహకులు

రాయదుర్గం: హెచ్‌సీయూలోని ఎస్పైర్ బయోనెస్ట్ ఇంక్యుబేటర్‌లోని స్టార్టప్ వీజెన్ ల్యాబ్స్‌కు కేంద్రం ఆర్థిక సహాయం అందించింది. ఊపిరితిత్తుల క్యాన్సర్ నివారణకు అవసరమైన మందుల తయారు చేయడంపై పరిశోధనలు చేసిన ఈ వీజెన్ ల్యాబ్స్‌కు కేంద్రంలోని శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖలోని బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్(బీఐఆర్‌ఏసీ) ద్వారా రూ.3.76 కోట్ల నిధులను మంజూరు చేశారు. భారతదేశంలో క్యాన్సర్ సంబంధిత మరణాలలో ఊపిరితిత్తుల క్యాన్సర్ కూడా ప్రధాన కారణాలలో ఒకటిగా ఉంది, ప్రతియేటా దేశంలో 70వేల మందికి కొత్తగా ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు గురవుతున్నట్లు నివేదికల్లో స్పష్టం అవుతోంది.

బయోటెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆనందదాయకం

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

బయోటెక్ ఆవిష్కరణలను ప్రోత్సహించడం ఆనందదాయకమని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. వీజెన్ ల్యాబ్స్ స్టార్టప్‌కు రూ.3.76 కోట్ల ఫండింగ్ రావడంపై ఆయన స్పందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో పరిశోధనలను ప్రోత్సహించడం ఎంతో అవసరమన్నారు. హెల్త్‌కేర్, మా ఇంక్యుబేషన్ నుంచి వినూత్న క్యాన్సర్ చికిత్సలకు అవసరమైన మందులను తయారు చేయడానికి వీజెన్ ల్యాబ్స్ కృషి అభినందనీయమన్నారు. ఇన్వెస్టర్లు వినూత్న ఔషధ అభివృద్ధికి ముందుకురావాలన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం!

- ఈనెల 5 నుంచి ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

మూసాపేట: కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశామని విద్యా శాఖ అధికారులు, కళాశాల యాజమాన్యం తెలిపింది. కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేశామని, సుమారు 32 జూనియర్ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించనున్నట్లు కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య తెలిపారు. సుమారు 632 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. ఈనెల 5 నుంచి 25 వరకు పరీక్షలు కొనసాగుతాయని ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 8.45 గంటల వరకు కేంద్రంలోకి అనుమతి ఇస్తామని, 9.5 నిమిషాలు దాటిన తర్వాత అనుమతించమని తెలిపారు. కేంద్రంలోకి స్మార్ట్‌వాచీలు, సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, సాధారణ వాచీలు అనుమతించమని ఇంటర్ అధికారులు తెలిపారు.



కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రత్యేక బస్సులు నడిపిస్తాం: ఆర్టీసీ డీఎం

ఇంటర్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేశామని ఆర్టీసీ డిపో మేనేజర్ హరి తెలిపారు. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బస్సులు నడుస్తాయని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రం వేరే ప్రాంతంలో ఉన్నా.. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు రూట్ పాస్ ఏదైనా బస్ పాస్‌ను కండక్టర్‌కు చూపిస్తే ఇంటి నుంచి సెంటర్ వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని సూచించారు. విద్యార్థులు అధికంగా ప్రయాణించే ప్రాంతాల్లో అప్పటికప్పుడు మరిన్ని బస్సులు నడిపేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తాం: ట్రాఫిక్ సీఐ

ఇంటర్ పరీక్షల దృష్ట్యా ట్రాఫిక్‌ను ఎప్పటికప్పుడు క్లియర్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ ముత్తు యాదవ్ తెలిపారు. మూసాపేట నుంచి జేఎన్‌టీయూ వరకు ఉన్న ప్రధాన రహదారి, పరీక్షా కేంద్రాలున్నా రహదారులపై ఉదయం 6 గంటల నుంచే ట్రాఫిక్ అధికారులు, సిబ్బంది విధుల్లో ఉంటారన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..


ఆల్విన్‌కాలనీలో మరమ్మతులు చేసిన మ్యాన్‌హోల్

ఆల్విన్‌కాలనీ: 'ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ, ఎల్లమ్మబండ, ఆస్‌బెస్టాస్ కాలనీ, సాయినగర్ తదితర ప్రాంతాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్‌కు సోమవారం మరమ్మతులు చేయించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.